క్లుప్తంగా

కేజీహెచ్‌ను మరింత అభివృద్ధి చేయాలి



అశోక్‌కుమార్‌ను సత్కరిస్తున్న శ్రీగణేష్ సేవా సంఘం ప్రతినిధులు

సీతమ్మధార : కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్‌ను 14వ వార్డు శ్రీ గణేష్ సేవా సంఘం అధ్యక్షుడు టీఎస్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీహెచ్‌ను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రకాశరావు, నాయుడు, జి. కృష్ణ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం ఐదవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబి పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

ఘనంగా నీలమాంబ మారువారోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు పరిధి రంగిరీజువీధిలో వెలసిన నీలమాంబ 41వ పరస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మారువారం పండగ సందర్భంగా పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, వార్డు నాయకులు అలమండ విజయ్, కోరుకొండ సూర్యప్రసాద్, బొడ్డేటి కిరణ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'చర్యలు చేపట్టాలి'

డాబాగార్డెన్స్: నిబంధనలు ఉల్లంఘించిన ఏయూ వీసీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ. అజశర్మ తెలిపారు. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఏయూ వీసీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని.. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు.

టాయిలెట్లు లేక టెన్షన్

- జోనల్ కార్యాలయానికి వచ్చే వారికి తప్పని అగచాట్లు
- సెల్లార్ ఉన్నా తీరని సమస్య

జగదాంబ: ప్రజలకు సేవలందించే జోనల్ కార్యాలయంలో మరుగుదొడ్లు లేకపోవడం విడ్డూరమని పలువురు చెబుతున్నారు. సూర్యాభాగ్ వద్ద జీవీఎంసీ జోన్‌–4 కార్యాలయం ఉంది. ఈ జోన్‌కు సంబంధించి 12 వార్డులు ఉన్నాయి. ఇక్కడ పబ్లిక్‌హెల్త్, జనన–మరణ ధ్రువపత్రాల నిమిత్తం, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ పనుల కోసం అనేక మంది వస్తుంటారు. ఇలా వచ్చిన వారిలో వృద్ధులు, మహిళలు, వికలాంగులు ఉంటారు. నాలుగు అంతస్తుల ఈ కార్యాలయంలో అన్ని అంతస్తుల్లో అధికారులకు సంబంధించి మరుగుదొడ్ల సౌకర్యం ఉంది కానీ.. ఇక్కడికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కోసం మాత్రం మరుగుదొడ్లు లేక అత్యవసర పరిస్థితుల్లో వారు ఇబ్బంది పడుతున్నారు.



సూర్యాభాగ్ జోనల్ కార్యాలయం

చుట్టూ దుర్వాసనే



సూర్యాభాగ్ కార్యాలయం కింది భాగంలో విశాలవంతమైన సెల్లార్ ఉండి కూడా మరుగుదొడ్డి లేకపోవడం వలన కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే వారందరూ వారికి కనిపించిన చోట మూత్ర విసర్జన చేయడంతో సెల్లార్‌లో ఒక్క నిమిషం కూడా ఉండలేని దుస్థితి. ప్రజాభివృద్ధి కోసం ఉన్న జీవీఎంసీ ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పించకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ప్రజల సౌకర్యార్థం కార్యాలయం కింది భాగంలో మరుగుదొడ్డి నిర్మించాలి. కార్యాలయంలో మరుగుదొడ్లు ఉన్నా బయటి నుంచి వచ్చిన వారికి అనుమతి ఇవ్వడంలేదు. సెల్లార్‌లో మరుగుదొడ్డి నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

–శివ, 35వ వార్డు నివాసి.

వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు



ఏదైనా పని మీద జోనల్ కార్యాలయానికి వెళ్లి నాలుగు అంతస్తులు ఎక్కడమే ఇబ్బందిగా ఉంటుంది. దీంతో పాటు ఇక్కడ అత్యవసరమైనప్పుడు మలవిసర్జన సమస్య ఉత్పన్నమైతే మరుగుదొడ్డి సదుపాయం లేక మరీ ఇబ్బందిగా ఉంటుంది. మహిళలు, వృద్ధులు ఈ సమస్యతో బాధ పడుతున్నారు. అందరి సౌకర్యార్థం సెల్లార్‌లో మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలి.

– సత్యనారాయణ, 36వ వార్డు నివాసి.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

- వేడుకగా అమ్మవారి జాతర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తులు



దుర్గాలమ్మ గుడి పరిసరాల్లో భక్తుల సందడి

డాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జాతరను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు తలపై పసుపు నీళ్ల బిందెలు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ పరిసరాల్లోని పలు ప్రాంతాల్లో భక్తులు అగ్నిగుండాలు తొక్కారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, దళమంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

26న మహాన్నదాన కార్యక్రమం..

అమ్మవారి మారువారాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆ రోజున అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు) ఉంటుందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

నూతన సేవా సంస్థ ప్రారంభం



క్లబ్ నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం నార్త్ ఈస్ట్ డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన సేవా సంస్థ ఆదివారం ప్రారంభమైంది. అధ్యక్షునిగా కంకటాల సతీష్, కార్యదర్శిగా మామిడి ప్రకాష్, కోశాధికారిగా కె. శ్రీలక్ష్మిచే ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ గవర్నర్ ఎం. ఉషారాజు ఎన్నికైన సభ్యులు నియమ నిబంధనలు పాటిస్తూ సేవా కర్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. గోపాలరావు, సీహెచ్ కృష్ణమూర్తి, వి. సాయినిర్మల, సీహెచ్ చందన, పద్మజ, టి. ఉషశ్రీ, ఎస్. సోమరాజు, సీహెచ్ కాశీ విశ్వనాథ్, ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



సంస్థలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులను సత్కరించిన ప్రముఖులు

డాబాగార్డెన్స్: స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధాశ్రమ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భగవాన్ రామకృష్ణ పరమహంస జయంతి సందర్భంగా 2014లో వివేకానంద వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. 10వ వార్షికోత్సవం సందర్భంగా వృద్ధాశ్రమంలో గల వృద్ధులందర్నీ ప్రముఖులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ సంఘ సేవకుడు కంచర్ల రాంప్రసాద్, కంచర్ల అన్నపూర్ణ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, పరిసర ప్రాంతంలో గల పేదలకు దుప్పట్లు, తువ్వాళ్లు, పాదరక్షలు, పండ్లు అందజేశారు. వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు వృద్ధుల కోసం చక్కటి స్కిట్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ మఠం స్వామి గీతాసారం నందా స్వామి, సంస్థ గౌరవ అధ్యక్షుడు, ఏఎస్ బీచ్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ జహీర్ అహ్మద్, సీనియర్ పాత్రికేయుడు వీవీ రమణమూర్తి, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, పలువురు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ ప్రాథమిక పరీక్ష



సీతంపేట శ్రీవిశ్వ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసు సిబ్బంది

సీతంపేట: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సీతంపేట ప్రాంతంలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, ప్రిజమ్ కళాశాల, శ్రీవిశ్వ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్ 1, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరిగింది. ద్వారకా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డు తనిఖీ చేసి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొబైల్ ఫోన్, ట్యాబ్, స్మార్ట్ వాచ్ వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను కేంద్రంలోకి తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు.

స్వాతిముత్యం సినిమా ఎన్నటికీ ఆణిముత్యమే

- ఆ చిత్ర సినిమాటోగ్రాఫర్ రఘు



మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు

ఏయూక్యాంపస్: తెలుగు సినీ చరిత్రలో స్వాతిముత్యం సినిమా ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందని సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు అన్నారు. స్వాతిముత్యం విడుదలై 37 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన రఘుతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూ హిందీ భవన్‌లో ఇష్టాగోష్టి నిర్వహించారు. ముందుగా సినీ నటుడు తారకరత్న మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర నిర్మాణంలో దర్శకేంద్రుడు కె.విశ్వనాథ్‌తో పనిచేసిన సందర్భం, సంఘటనలను వివరించారు. విశ్వనాథ్ దర్శకత్వం, ఇళయరాజా సంగీతం సినిమాకు ప్రాణం పోశాయన్నారు. విశ్వనాథ్ ఆలోచన విధానంతో ఈ చిత్రాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడంలో తన పాత్ర కూడా ఉండటంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ఉన్నంత కాలం ఈ సినిమా ప్రజలకు గుర్తుంటుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా, అందరూ చూడదగిన సినిమాగా స్వాతిముత్యం ఉంటుందన్నారు. దక్షిణ భారత దేశంలో తొలి సారిగా ఆస్కార్‌కు పంపిన ఈ సినిమా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. విశ్వనాథ్‌తో తరువాత సిరివెన్నెల సినిమాలో పనిచేయడం గొప్ప అనుభూతి కలిగిందన్నారు. ఆయన మరణం తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటని చెప్పారు. విలేకరుల సమావేశంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ



నిత్యావసర సరకులు, సామగ్రి అందిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

అరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి రాష్ట్ర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదివారం నిత్యావసర సరకులు, సామగ్రి అందజేశారు. ఇక్కడ ఉన్న అనాథ పిల్లలకు ఉపయోగపడే వస్తువులు అందించిన అధికారులకు ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద అవధూత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ మాట్లాతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఓర్పు, సహనంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు, విశాఖ సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన దీక్షలు 687వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నారు. అంత వరకు ఈ దీక్ష సాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

రీ నోటిఫికేషన్ ఇవ్వాలి

డాబాగార్డెన్స్: ఐఎన్‌సీఈ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలకు సంబంధించి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఇండియన్ నేవీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) ప్రతినిధి ప్రసాద రెడ్డి కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సొసైటీ ఎన్నికల నిర్వహణలో ప్రస్తుత పాలకవర్గానికి ఎన్నికల అధికారి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా ఎవరికీ తెలియకుండా సొసైటీని నిర్వహిస్తున్నారని, పాలకవర్గంలో ఫోర్జరీ సంతకాలు చేసి కొంత మొత్తాని లోన్ రూపంలో ఇచ్చారని, ఆ లోన్‌ను రికవరీ చేయలేకపోయారని, ఆ మొత్తాన్ని డైరెక్టర్లందరూ సొసైటీకి జమ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ నెల 24న జరగనున్న సహకార ఎన్నికల్లో ప్రస్తుత పాలకవర్గమైన సిటూ అనుబంధ యూనియన్‌కు మేలు చేసేలా ఎన్నికల అధికారి వ్యవహరిస్తుండడంపై మండిపడ్డారు. సమావేశంలో నేవీ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఆర్థిక సాయం



లక్ష్మణరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు

మురళీనగర్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పట్టాభిరెడ్డి గార్డెన్‌కు చెందిన లక్ష్మణరావు అనే వ్యక్తికి రూ.10,000, మర్రిపాలెం మహారాణి వీధికి చెందిన నాటక కళాకారుడు తిరుమలరావుకు రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సీతారామకృష్ణ, కోశాధికారి కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ఆరిలోవ: మహాశివరాత్రి సందర్భంగా తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని శివాలయంలో జాగరణ భక్తుల కోసం శనివారం అర్ధరాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. సుమారు 70 మంది చిన్నారులతో కూచిపూడి నృత్యాలు నిర్వహించనట్లు అకాడమీ నిర్వాహకురాలు నాగ చందన తెలిపారు. చిన్నారులను భక్తులు, శివాలయం నిర్వాహకులు అభినందించారు.

శాఖా గ్రంథాలయంలో స్టోరీ టెల్లింగ్



స్టోరీ టెల్లింగ్ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

అల్లిపురం: బంగారుమెట్ట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చిన్నారులకు స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఆదివారం గ్రంథాలయానికి వచ్చి ఒక సమూహంగా ఏర్పడాలన్నారు. పుస్తకాలు చదువుతూ, ఒకిరికొకరు వివరించుకుంటూ విజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. గ్రంథాలయంలో చిన్నారులకు సంబంధించిన బొమ్మరిల్లు, చందమామ వంటి పుస్తకాలతో పాటు కామిక్స్, విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా నిరుద్యోగ యువతకు ఉపయోగపడే విధంగా కాంపిటీటివ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన వారు వారికి కావాల్సిన పుస్తకాల గురించి గ్రంథాలయంలో గల సూచనలు, సలహాల పుస్తకంలో రాసినట్లయితే వాటిని సమకూరుస్తామని తెలిపారు. మహిళలకు అవసరమైన నవలలు అద్దె ప్రాతిపదికన, చందాదారులై పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు.

నియోజకవర్గంలో పలు చోట్ల అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో వడ్డిస్తున్న పలువురు నాయకులు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో 39వ వార్డు కార్పొరేటర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు మహ్మద్ సాదిక్ పాల్గొని ప్రారంభించారు. 35వ వార్డు దుర్గాలమ్మ గుడి సమీపాన కల్లుపాకల వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కండిపల్లి నర్సింగరావు ఏర్పాటు చేసిన ప్రసాద వితరణను సాదిక్ ప్రారంభించారు. అలాగే దుర్గాలమ్మ గుడి వద్ద స్థానిక యువత భక్తుల కోసం ఏర్పాటు చేసిన టిఫిన్ పంపిణీ, పూర్ణామార్కెట్ వద్ద మదీనా ఆధ్వర్యంలో అమ్మవారికి చిత్రపటాలు, ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. 39వ వార్డు కన్వేయర్ బెల్ట్ వద్ద నర్సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను, 36వ వార్డు రంగిరీజువీధిలో అన్నదాన కార్యక్రమాన్ని సాదిక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల వెంకట్రావు, సూరాడ తాతారావు, కండిపల్లి నర్సింగ్, అర్జిలి మసేన్, బొడ్డు అప్పారావు, అలమండ విజయ్, సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా ఎల్‌ఐసీ ఉద్యోగి



ఎల్ఐసీ ఉద్యోగి శర్మ

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, జీవిత బీమా సంస్థ ఉద్యోగి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ ప్రపంచ టేబుల్ టెన్నిస్ పోటీలకు అంపైర్‌గా నియమితులయ్యారు. ఈ నెల 26 నుంచి వచ్చే నెల 6 వరకు గోవాలో జరగనున్న తొలి అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ టోర్నమెంట్‌కు శర్మను అంపైర్‌గా ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ నియమించింది. శర్మ గత ఏడాది సెప్టెంబర్‌లో లావోస్‌లో జరిగిన ఏషియన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్‌లో అత్యున్నత అంపైర్ టెస్ట్‌లో బ్లూ బ్యాడ్జి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ సుధాకర్ బాబు, మేనేజర్ (పర్సనల్) భగవాన్‌ప్రసాద్, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు వరప్రసాద్, కామేశ్వరి తదితరులు శర్మని అభినందించారు.

పబ్లిక్ డిమాండ్

విరిగిన స్తంభాన్ని తొలగించండి



ప్రమాదభరితంగా పడి ఉన్న విరిగిన విద్యుత్ స్తంభం

కంచరపాలెం: జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారి ఎర్రిగెడ్డ సమీపంలో విద్యుత్ స్తంభం నిరుపయోగంగా పడి ఉంది. దీన్ని ప్రధాన రహదారి ఫుట్‌పాత్ పక్కన నిర్లక్ష్యంగా వదిలేయడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కంచరపాలెం జోన్‌–2 ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇక్కడికి దగ్గరలో పాఠశాలల విద్యార్థులు సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కరం చూపాలి.

వేళంగిణి, బాబుకాలనీ, జ్ఞానాపురం.

బాలికల వసతి గృహం సందర్శన



ఆహారాన్ని పరిశీలిస్తున్న బులికృష్ణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందరర్శించారు. అక్కడి వసతులను, బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. హాస్టల్ సంక్షేమ అధికారి గిరీశ్వరి, పారాలీగల్ వలంటీర్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.